
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 22 మే 2024





స్ట్రాంగ్‌రూమ్‌లు, భద్రతను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్పీ

సత్రం భూములపై.. నేతల కన్ను



బాపట్ల, మే21(ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం జాతీయ రహదారి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు సత్రం భూమి లీజుకిచ్చే విషయంలో నిబంధనలకు పాతర వేశారు. తాజాగా పెట్రోలు బంకుకోసం ఐవోసీకి స్థలం ఇచ్చే విషయంలో ఏకపక్ష నిర్ణయంపై అభ్యంతరం తలెత్తింది. స్టేటస్ కో ఉత్తర్వులు ఉన్న సత్రం భూమిలో ఏకంగా రోడ్డే వేశారు.. ఇలా ప్రతి విషయంలో బాపట్లలో ఉన్న పేరం గరుడాచలం నాయుడు (తూర్పుసత్రం) భూముల విషయం వివాదాస్పదం అవుతూనే ఉంది. దశాబ్దాల క్రితం నిరుపేదల క్షేమం కాంక్షిస్తూ గురుడచాలం నాయుడు అనే వ్యక్తి దాదాపు 92 ఎకరాల భూమి బాపట్ల పరిసర ప్రాంతాల్లోని పలుచోట్ల దానంగా ఇచ్చారు. ప్రస్తుతం వాటి విలువ కోట్లలోనే ఉండడంతో రాజకీయ పార్టీ నేతల కన్ను వాటిమీద పడింది. అత్యంత పారదర్శకంగా, ప్రజాభిప్రాయం మేరకు జరగాల్సిన నిర్ణయాలను, ప్రభుత్వం ట్రస్టు భూములను తమ సొంత ఆస్తిలాగా భావించి ఇష్టారీతిన వ్యవహరించడం పట్ల అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. దాదాపు ఆరు దశాబ్దాల క్రితం సత్రం భూమిని లీజుకు తీసుకున్న వ్యక్తి తర్వాత వాటిని తనకు అమ్మాలని న్యాయపోరాటానికి దిగారు. ఈ విషయంలో దేవాదాయశాఖ సైతం గట్టిగా పోరాడడంతో భూమిని కాపాడుకోగలిగారు. లీజు అగ్రిమెంట్లన్నీ మరొక్కసారి సమీక్షించడంతో పాటు తూర్పు సత్రం భూముల ప్రస్తుత స్థితిపై నివేదిక విడుదల చేయాలనే డిమాండ్‌ను కాపు సేవా సంఘంతో పాటు బాపట్ల ప్రజలూ చేస్తున్నారు.

ఐవోసీ లీజు విషయం తాజాగా వెలుగులోకి...

సత్రం భూములను లీజుకిచ్చే విషయంలో పారదర్శకతకు పాతరేస్తున్నారన్న విమర్శ ఉంది. ఆ భూమిలో 0.78 సెంట్లు స్థలం ఐవోసీకి లీజుకిచ్చే విషయం అకస్మాత్తుగా తెరమీదకు తీసుకొచ్చారని, అది కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా హడావిడిగా ఆ నిర్ణయాన్ని అమలు చేయడం పట్లే పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. లీజు ధర నామమాత్రంగానే ఉందని, అదికూడా

- ప్రతిసారీ వివాదాస్పదమవుతున్న ప్రభుత్వ నిర్ణయాలు
- స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా...
- స్టేటస్ కో ఉన్న సత్రం భూమిలో రోడ్డు వేసిన వైనం
- భూముల స్థితిపై నివేదిక విడుదల చేయాలని డిమాండ్

స్థానికుల అభిప్రాయంతో నిమిత్తం లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

కోర్టు ధిక్కరణకు సైతం...

సత్రం భూమిలో కొంత భాగం దాదాపు ఆరు దశాబ్దాల క్రితం రైస్ మిల్లు కోసం ఒకరు లీజుకు తీసుకున్నారు. తర్వాత దానిని తనకు అమ్మాలనే ప్రతిపాదనను తీసుకొచ్చారు. దానికి దేవాదాయశాఖ ససేమిరా అనడంతో కోర్టు గడప తొక్కారు. తదుపరి ఉత్తర్వుల్లో భాగంగా స్టేటస్ కో విధిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది. కానీ దానిని సైతం లెక్క చేయకుండా సర్వే నెంబరు 656 పరిధిలో దాదాపు 8 సెంట్ల స్థలంలో ఏకంగా రోడ్డునే వేయడం సత్రం భూముల రక్షణను ప్రశ్నార్థకం చేసింది.

రాజకీయ నేతల కన్ను..

సత్రం భూముల విషయంలో రాజకీయ నేతల కన్ను పడడమే వివాదస్పద నిర్ణయాల వెనక ఉన్న కారణంగా తెలుస్తోంది. తొలుత లీజుల పేరిట అగ్రిమెంట్లు చేసుకుని చట్టంలో ఉన్న లొసుగులను ఆధారంగా చేసుకుని క్రమబద్ధీకరణ చేసుకునే కుట్ర తెరవెనక జరుగుతుందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తూర్పు సత్రం భూముల ప్రస్తుత స్థితిపై సమగ్ర నివేదిక తయారు చేసి ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలనే డిమాండ్లు అన్ని వైపుల నుంచి వస్తున్నాయి.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద.. పటిష్ఠ భద్రత

- కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, మే 21: స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పటిష్ఠ భద్రత కొనసాగించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఈసీ మార్గదర్శకాల మేరకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఆరు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్‌లు వచ్చేందుకు మార్గాలు ఏర్పాట్లు చేయాలన్నారు. బారికేడ్‌లు సిద్ధం చేసుకోవాలని, అనుమతులు లేకుండా ఎవరిని కళాశాల ప్రాంగణం వైపు రానివ్వరాదన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కొరకు ప్రత్యేక టేబుల్స్, ఈవీఎం యంత్రాలలో ఓట్ల లెక్కింపు కొరకు ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్లలెక్కింపు కేంద్రాల వద్ద ప్రతి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించేలా వెబ్ క్యాస్టింగ్ కంట్రోల్ రూమ్ నడిపించాలన్నారు. కంట్రోల్ రూమ్ వద్దనే మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి కొంత దూరం లో వాహనాల పార్కింగ్ స్థలం ఎంపిక చేయాలని ఎస్పీకి సూచించారు. మూడు అంచల భద్రతపైఅధికారులు అప్రమత్తంగా ఉండాలని పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీధర్, అదనపు ఎస్పీ విఠలేశ్వర రావు, జిల్లా రెవెన్యూ అధికారిసత్తిబాబు, ఆర్డీవో జి.రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల, మే 21 : శాంతిభద్రతలకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎన్నికల కౌంటింగ్‌పై భద్రత ఏర్పాట్లు, వివిధ పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు అనుసరించాల్సిన ఎన్నికల నియమావళి గురించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ నిమిత్తం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో, చుట్టుపక్కల ప్రాంతాలలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎలాంటిఊరేగింపు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. జిల్లాలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో పోలీసు బలగాలతో పికెట్‌లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్, సెక్షన్ 144 సిఆర్‌పిసి, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలలో ఉన్నందున ఏ ప్రాంతంలో నలుగురు కన్నా ఎక్కువమంది ఒకేచోట గుమ్మికూడి ఉండరాదని, బహిరంగసభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. బంకులలో పెట్రోల్‌ను బాటిల్స్‌లో నింపరాదన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.7

పాఠకుని పూర్తి పేరు : ....

దోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....


గుంటూరు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది,
మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. గుంటూరు ఈస్ట్				
2. గుంటూరు వెస్ట్				
3. తాడికొండ				
4. ప్రత్తిపాడు				
5. మంగళగిరి				
6. తెనాలి				
7. పొన్నూరు				
8. బాపట్ల				
9. రేపల్లె				
10. వేమూరు				
11. మాచర్ల				
12. గురజాల				
13. వినుకొండ				
14. చిలకలూరిపేట				
15. నరసరావుపేట				
16. పెదకూరపాడు				
17. సత్తెనపల్లి				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : శివశంకరీ దేవాలయం దగ్గర, వెంగళాయపాలెం, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు జిల్లా

ఎన్‌జీ రంగా వర్సిటీలో కోర్సులు



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ దూరవిద్య విభాగం- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు (రెండు నెలలు). గ్రామీణ రైతులు, మహిళలు, యువత దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై నుంచి సెప్టెంబరు వరకు శిక్షణ తరగతులు ఉంటాయి.

కోర్సులు: మిద్దె తోటల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, జీవన ఎరువుల పెంపకం.

అర్హత: వయోపరిమితి నిబంధనలు లేవు. తెలుగు చదవడం, రాయడం తెలిసి ఉం డాలి. కంప్యూటర్/ఆండ్రాయిడ్ ఫోన్ ఉండాలి.

శిక్షణ: రిజిస్ట్రేషన్ చేసుకొన్నవారికి పాఠ్య ప్రణాళిక పుస్తకం ఇస్తారు. వారానికి ఒక రోజు చొప్పున మొత్తం ఏడు ఆన్‌లైన్ తరగతులు ఉంటాయి. ఒక్కో తరగతి సమయం 2 గంటలు. ఇందులో క్విజ్‌లు, అసైన్‌మెంట్‌లు నిర్వహిస్తారు. వీటికి అభ్యర్థుల అటెండెన్స్ తప్పనిసరి. అభ్యర్థి ఎంపిక చేసుకొన్న స్టడీ సెంటర్లో ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. కోర్సు పూర్తయిన తరవాత పరీక్ష ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **చిరునామా:** డీన్(వ్యవసాయం) కార్యాలయం, పరిపాలన భవనం, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు- 522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

దిక్సూచి
DIKSUCHI

సీబీఐపీలో పీజీ డిప్లొమా

హరియాణాలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్(సీబీఐపీ)- 'పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ విత్ ఆటోమేషన్ స్కాడా/డీఎంఎస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి 26 వారాలు. ఇది జాబ్ ఓరియంటెడ్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్. ఇందులో 75 శాతం థియరీ, 25 శాతం ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. స్పాన్సర్డ్, నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పవర్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.cbip.org

SCHOLARSHIP ALERT

ICRO Amrit Internship Programme

Description: ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.

Eligibility: Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.

Prizes & Rewards: A monthly stipend of 6,000 and a certificate of completion

Last Date to Apply: 01-10-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/ICRA1



NextGen Edu Scholarship

Description: Buddy4Study in collaboration with EY Global Delivery Services is inviting applications through NextGen Edu Scholarship 2024-25 - a social impact initiative. Class 11 students enrolled in private or government schools across India are eligible to receive financial support for their studies.

Eligibility: Students studying in Class 11 at any private/government school across India are eligible to apply. Applicants must have secured a minimum of 60% in their Class 10. They must have an annual family income up to INR 3 lakh from all sources.

Prizes & Rewards: Scholarship of INR 15,000

Last Date to Apply: 26-06-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/EYGDS1

UK-India TOEFL Scholarship

Description: UK-India TOEFL Scholarship 2024 is a program that supports Indian students pursuing full-time UG/PG studies in the UK. This opportunity is offered by the Educational Testing Service (ETS), in collaboration with the National Indian Students and Alumni Union (NISAU).

Eligibility: Open to Indian citizens applying to undergraduate or postgraduate courses at UK universities. Applicants must have taken the TOEFL iBT test between April 1 and July 15, 2024, with a minimum score of 75.

Prizes & Rewards: A one-time scholarship of 2,50,000 each for 10 students

Last Date to Apply: 15-07-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/TOEF1

buddy4study.com


'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Wn7hfeQలో చదవండి.



కేన్స్‌లో కన్నప్ప సందడి

విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. దాంతో ప్రమోషన్ వర్క్‌కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లిన కన్నప్ప టీమ్ అక్కడ సందడి చేసింది. నిర్మాత మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా ఈ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. అక్కడ 'కన్నప్ప' టీజర్‌ను అందరికీ ప్రదర్శించారు. ఈ టీజర్ చూసి అక్కడి ప్రేక్షకులు ముగ్ధులయ్యారని విష్ణు తెలిపారు. ఇంటర్నేషనల్ డిస్ట్రిబూటర్స్, కేన్స్ ఫెస్టివల్‌కు వచ్చిన ఇండియన్స్ టీజర్ బాగుందని అభినందించారు. ఆ రెస్పాన్స్ చూసిన తర్వాత నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు.' అని ఆయన తెలిపారు. జూన్ 13న ఇండియా వైడ్‌గా 'కన్నప్ప' టీజర్ విడుదల చేస్తారు. దానికంటే ముందు ఈ నెల 30న తెలుగులో కన్నప్ప టీజర్‌ను రిలీజ్ చేస్తామని విష్ణు వెల్లడించారు. 'మా కన్నప్పను సోషల్ మీడియాలో మొదటి నుంచి ప్రోత్సహిస్తున్న కొంతమంది సెలెక్టెడ్ ఆడియన్స్‌కు ఈ టీజర్ చూపిస్తాం' అని అన్నారు. ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌బాబు నిర్మిస్తున్నారు.


కొత్త తేదీన హరోం హర



సుధీర్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రం 'హరోం హర'. మరోసారి ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెలాఖరున ఈ చిత్రం విడుదలవ్వాలి. అయితే మంగళవారం చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. జూన్ 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో వెనుక అగ్ని జ్వాలలు చెలరేగుతుండగా, భుజంపై తుపాకీతో నడిచొస్తున్న సుధీర్‌బాబు లుక్ శక్తిమంతంగా ఉంది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు జ్ఞానసాగర్ ద్వారక దర్శకుడు. మాళవిక శర్మ కథానాయిక. సునీల్ కీలక పాత్ర పోషించారు. సుమంత్ జి. నాయుడు నిర్మాత. సంగీతం: చైతన్ భరద్వాజ్. సినిమాటోగ్రఫీ: అరవింద్ విశ్వనాథన్.

ఖురేషి అబ్రమ్.. అదిరే లుక్!

మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్ నటించిన సూపర్ హిట్ ఫిల్మ్ 'లూసిఫర్'కు సీక్వెల్ వస్తోంది. 'ఎల్ 2 ఎంపురాన్' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ ఖురేషి అబ్రమ్ పాత్రను పోషిస్తున్నారు. స్టీఫెన్ నడుంపల్లి ఖురేషి అబ్రమ్‌గా ఎలా మారాడనే విషయాన్ని సీక్వెల్‌లో చూపించబోతున్నారు. మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా ఆ పాత్ర లుక్ విడుదల చేశారు. స్టయిలిష్‌గా నడుచుకుంటూ వస్తున్న మోహన్‌లాల్ లుక్ అదిరిపోయిందని అంటున్నారు. నటుడు, ఈ చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమార్ 'హ్యాపీ బర్త్ డే లాలెట్టా' అంటూ సోషల్ మీడియా వేదికగా మోహన్‌లాల్‌కు



అభినందనలు తెలిపారు. మరో విషయం ఏమిటంటే లైకా ప్రొడక్షన్స్ సంస్థ 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రంతో మలయాళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెడుతోంది. లడఖ్, చెన్నై, కొట్టాయం, అమెరికా, లండన్ ప్రాంతాల్లో 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రం షూటింగ్ జరిగింది. ప్రస్తుతం తిరువనంతపురంలో చిత్రీకరణ జరుగుతోంది. ఆ తర్వాత గుజరాత్, దుబాయ్‌లో కూడా షూటింగ్ చేయాలని దర్శకనిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది భారీ లెవల్‌లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు సుభాస్కరన్, ఆంటోనీ పెరుంబవూర్ చెప్పారు.

పారితోషికం రూ.250 కోట్లా?



బాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగి, పెళ్లి చేసుకుని అమెరికాలో సెటిల్ అయిన ప్రియాంక నటనకు గుడ్‌బై చెప్పకుండా హాలీవుడ్ సినిమాలు, సిరీస్‌లు చేస్తూ బిజీగానే ఉన్నారు. అమెజాన్ ప్రైమ్ కోసం ఆమె గత ఏడాది 'సెటడెల్' సిరీస్‌లో నటించారు. దీనికి ఇండియన్ వెర్షన్‌లో ప్రియాంక పాత్రను సమంత చేశారు. 'సిటాడెల్'లో నటించినందుకు ప్రియాంక తీసుకున్న పారితోషికం ఎంతో తెలుసా? దాదాపు రూ. 250 కోట్లు. బాపురే.. అనుకోకండి. ఇది నిజమే. ఇటీవల వచ్చిన సంజయ్ లీలా భన్సాలి 'హీరామండీ' కోసం నెట్‌ఫ్లిక్స్ చెల్లించిన మొత్తం కంటే ప్రియాంక తీసుకున్న పారితోషికమే ఎక్కువట. అంటే ఇప్పుడు ఓటీటీలో హయ్యెస్ట్ పెయిడ్ ఆర్టిస్ట్ ప్రియాంక నే అన్నమాట. ఆమె పనే బాగుంది కదూ!

డర్టీఫెలోకు ఛాయిస్ లేదు



శాంతి చంద్ర, దీపిక సింగ్, సిమ్రిత్, నికిష రంగ్‌వాలా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. అడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి. శాంతిబాబు నిర్మించారు. ఈ నెల 24న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సంపూర్ణేశ్‌బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాకు 'డర్టీఫెలో' అనే టైటిల్ ఎందుకు పెట్టారు అని శాంతిచంద్రను అడిగాను. 'ఈ కథకు ఆ టైటిల్ తప్ప మరో ఛాయిస్ లేద'ని ఆయన చెప్పారు. మంచి కథతో వస్తున్న చిత్రమిది' అన్నారు. శాంతి చంద్ర మాట్లాడుతూ 'ఎప్పటికైనా హీరో కావాలనుకున్నాను. అది 'మంత్ర' చిత్రంతో నెరవేరింది. ఆ తర్వాత బిజినెస్ పనులతో గ్యాప్ వచ్చింది. మళ్లీ 'డర్టీఫెలో' కథ నచ్చడంతో నిర్మాణ బాధ్యతలు తీసుకున్నాను. ఎమోషన్, యాక్షన్, రొమాన్స్, ఫ్యామిలీ డ్రామా లాంటి అన్ని హంగులు ఉన్న చిత్రమిది' అన్నారు. అడారి మూర్తి సాయి మాట్లాడుతూ 'సినిమాను థియేటర్‌లోనే చూడండి. చిన్న సినిమాలను బతికించండి. చిత్రబృందం అంతా ఒకే కుటుంబంలా కలసి పనిచేశాం. కథా బలమున్న చిత్రమిది' అన్నారు.



జూన్‌లో 'ఓ.సి' వినోదం

హరీశ్ బొంపెల్లి, మాన్య సలాడి జంటగా తెరకెక్కిన చిత్రం 'ఓ.సి'. ఈ యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌కు హరీశ్‌బొంపెల్లి దర్శకుడు. బీవీఎస్ నిర్మాత. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. జూన్ 7న 'ఓసి' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ మంగళవారం ప్రకటించింది. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ 'ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా పరిశ్రమకు వచ్చిన కొందరు యువకుల జీవితాలు ఎలాంటి మలుపు తిరిగాయనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఆసక్తి కరంగా ఉంటుంది. నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు 'ఓ.సి' అనే టైటిల్ పెట్టడానికి ఉన్న కారణం సినిమా చూస్తే తెలుస్తుంది' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి వంశీ ఎస్., అక్షర్ బ్యాండ్ సంగీతం అందించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/y8pE852 లో చదవండి.

గవర్నర్‌కు స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ, కలెక్టర్

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పర్యటనకు వెళుతూ గుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ స్వాగతం పలికారు. రైల్వేస్టేషన్‌లో తొలుత ఆయనకు గార్డ్ ఆఫ్ ఆనర్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు పుష్పగుచ్ఛాలు అందజేశారు. గవర్నర్ శబరి ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు జిల్లాకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులు గవర్నర్ నివాసం నుంచి రైల్వేస్టేషన్ వరకు పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాష్ట్ర భవిష్యత్‌కు బంగారు బాట అమరావతి

- 1617వ రోజుకు రైతుల ఆందోళనలు



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు


తుళ్లూరు, మే 21: రాజధాని అమరావతి నిర్మాణం అడ్డుకున్న వారు అధికారంలోకి రావటం కలే అవుతుందని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1617వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. మూడు ముక్కలాటతో ఏమైనా ప్రయోజనం ఉందా.. అనేది ప్రజలకు సీఎం జగన్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. అదే అమరావతితో ఎంత ప్రయోజనం రాష్ట్రానికి ఉందో చెపుతామని సవాల్ విసిరారు. లక్షల కోట్ల రాష్ట్ర ప్రజల సంపద అమరావతిని హస్తగతం చేసుకోవాలని సీఎం జగన్‌రెడ్డి చూశాడన్నారు. అది కుదరక పోవటంతో విశాఖలో వేల కోట్ల భూములు కారు చౌకగా కొనుగోలు చేసి అక్కడ రాజధాని అంటున్నాడని దీనిని ప్రజలు అర్థం చేసుకునే ఈ ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపటానికి ఓటు వేశారన్నారు. వైసీపీ వారు విశాఖలో జరిపిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ గురించి నిగ్గు తేలాల్సిన అవసరం ఉందన్నారు. భావితరాల వారి భవిష్యత్‌కు బంగారు బాట అమరావతి అని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



ప్రభుత్వంపై పందెమా.. నై నై

- వైసీపీ తరపున కాసేందుకు పందెం రాయుళ్ళ వెనుకంజ
- రూపాయికి రూపాయిన్నర ఇస్తామన్నా వెనకడుగు
- రూపాయికి రూపాయి పందాలు నిల్
- ఫలితాలకు ముందే వైసీపీ నేతలు డల్

గుంటూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు జరగక ముందే వైసీపీ నేతలు డీలా పడిపోయారు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఓటరు నాడి అర్థం కాక పోలింగ్ ప్రక్రియ ముగిసిన దగ్గరి నుంచి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వచ్చేవరకు ఇరు పార్టీలు పోటీలు పడి పందేలు వేసుకునేవారు. సహజంగా రూపాయికి రూపాయి అంటే సమాన రీతిలో బెట్టింగ్‌లు ఉండేవి. ఒక పార్టీ వారు కోటి రూపాయలు కాస్తే ప్రత్యర్థి పార్టీ వారు పోటీ కలపాలి. ఇప్పుడు అటువంటి బెట్టింగ్‌లు మచ్చుకు కూడా జరగటం లేదు. గత ఐదేళ్ళుగా రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రి జగన్ హయాంలో ప్రభుత్వం అన్ని విధాలుగా అప్రతిష్టపాలు అయింది. పాదు పెట్టటం, కూల్చటం, కొట్టటం, కేసులు పెట్టి జైళ్ళలో పెట్టించటం తప్పితే ఏమాత్రం రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో వైఎస్ఆర్ హయాంలో కూడా లేని విధంగా కక్షలు కార్పణ్యాలతో రాష్ట్రం రగిలిపోయింది. ముఖ్యంగా ఉద్యోగ వర్గాలు కూడా సకాలంలో జీతాలు అందక అష్టకష్టాలు పడ్డారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికల్లో పోలింగ్ రోజునే ఎన్నికలు ఏకపక్షంగా జరిగినట్లు కనిపించింది. ముఖ్యంగా ఉద్యోగులు కసితీరా ఓట్లు వేయటంతో పోలింగ్ శాతం కూడా ఎన్నడూ లేని విధంగా పెరిగింది. దేశం నలు మూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు కదిలి రావటం ఆశ్చర్యకరం. దీంతో పోలింగ్ రోజే డీలా పడిపోయిన వైసీపీ నేతలు పందేలు వేసేందుకు వెనుకాడుతున్నారు. ముఖ్యంగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని బెట్టింగ్ వేసేందుకు ఎంతోమంది ముందుకు వస్తున్నారు. రూపాయికి రూపాయి పందేలు దొరక్కపోవటంతో టీడీపీ తరుపున పందెం వేసే వాళ్ళు తాము రూపాయికి, రూపాయన్నర ఇస్తామని ముందుకు వచ్చినా వైసీపీ తరపున బెట్టింగ్ వేసే పందెం రాయుళ్ళు తటపటాయిస్తున్నారు. బెట్టింగ్‌లకు కేంద్రమైన గుంటూరులోని ఓ ప్రముఖ క్లబ్‌లో గతంలో కోట్లలో పందేలు నడిచేవి. ఇప్పుడు వైసీపీ తరపున పందెం వేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవటంతో అక్కడ కొలువు తీరే పందెం రాయుళ్ళు నిరుత్సాహ పడుతున్నారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏ ఒక్క నియోజకవర్గంపై కూడా బెట్టింగ్‌లకు ఎవరూ ముందుకు రావటం లేదు. గతంలో పలానా నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు లేదా రెండు, మూడు నియోజకవర్గాల్లో ఒకటి రెండైనా పలానా పార్టీకి వస్తుందని పందేలు ఉండేవి. ఇప్పుడు పోలింగ్ ప్రక్రియ ముగిసిన రెండు, మూడు రోజుల్లోపు ఉమ్మడి జిల్లాలోని రెండు, మూడు నియోజకవర్గాల్లో వైసీపీ గెలుస్తుందని కొందరు బెట్టింగ్ పెట్టేందుకు ముందుకు వచ్చినప్పటికి తదనంతరం లెక్కలు వేసుకొని వాటిపై కూడా పందెం వేసేందుకు వెనుకంజ వేశారు. ఇదిలా ఉండగా పల్నాడు జిల్లాలో ఓ నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున బరిలోకి దిగిన ఓ అభ్యర్థి తను గెలుస్తానని తన తరుపున ఎవరూ పందెం వేయకపోవటంతో మాటలు కోటలు దాటించే ఆ అభ్యర్థి ఏకంగా తానే పందెం బరిలోకి దిగి రూ.50 లక్షలు పందెం వేసినట్లు సమాచారం. అది కూడా రూపాయికి రూపాయి కాదు ఇతను రూపాయి కలపగా ఆ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గెలుస్తాడని అతనిపై పందెం వేసిన వ్యక్తి రూపాయన్నర అంటే రూ.75 లక్షలు కలిపినట్లు ప్రచారం జరుగుతుంది. మైకుల ముందుకు వచ్చి తమ పార్టీ 150 సీట్లకు పైగా గెలుస్తుందని చెప్పే నాయకులు సైతం పందెం మాట ఎత్తితే పెదవి విప్పటం లేదు.



ఇసుక తవ్వకాలపై నిబంధనలు పాటించాల్సిందే

- పల్నాడు జిల్లా కలెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీ
- మల్లాది, కోనూరు ఇసుక రీచ్‌ల పరిశీలన



మల్లాది ఇసుక రీచ్‌లో కలెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీతో ఇతర అధికారులు

అమరావతి, మే 21: జిల్లాలో ఇసుక తవ్వకాలపై సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ సూచనలు తప్పక పాటించాలని మైనింగ్, ఎస్ఈబీ, రెవిన్యూ అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం పెదకూరపాడు నియోజకవర్గం మల్లాది, కోనూరు ఇసుక రీచ్‌లను సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ ఆదేశాలను అన్ని జిల్లాలకు ప్రభుత్వం జారీ చేయడం జరిగిందని తెలిపారు. అందుకు అనుగుణంగా జిల్లాలో ఉన్న రీచ్‌లలో ఇసుక క్వారీయింగ్‌కు అనుమతి లేదని అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాలు సీజ్‌చేసి కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమ క్వారీయింగ్‌కు సంబంధించి ప్రజలు సమాచారం ఇచ్చేందుకు గ్రామాల్లో అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లతో ఐదు డిసిల్టేషన్ పాయింట్‌లు ఉన్నాయని. ఇసుక తవ్వకాలకు సంబంధించి ప్రస్తుతం జీసీకేసీ అనే ఏజెన్సీకి ప్రభుత్వం అప్పగించిందని తెలిపారు. తవ్వకాలు జరుపుకునేందుకు వారికి పూర్తిగా అనుమతి రాలేదన్నారు. వారిపేరున అనుమతులు వచ్చిన తరువాత మాన్యువల్‌గా ఇసుక క్వారీయింగ్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. ఎక్కడా కూడా మిషనరీ వాడకూడదని ఎన్‌జీటీ గైడ్‌లైన్స్‌లో ఉందని అన్నారు. డిసిల్టేషన్ పాయింట్‌లలో ఇసుక త్రవ్వకాలు చేయడానికి ఎలాంటి ఇబ్బంది లేదని. వారు ప్రభుత్వానికి నగదు చెల్లించిన తరువాత సీఎఫ్ఓ, సీఎఫ్‌కు (కన్సెంట్ ఫర్ ఆపరేషన్స్ కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్) అనుమతితో చేసుకోవచ్చు అన్నారు. దానికోసం ఈ రోజు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం పెట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. దీని వలన ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంటుందని కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ అన్నారు. అనంతరం కోనూరు రీచ్ పరిశీలనకు వెళ్లారు. కలెక్టర్ వెంట మైనింగ్ ఏడి నాగిణి, ఆర్డీఓ మురళీకృష్ణ, తహశీల్దార్ వెంకటరమణారావు, ఎంపీడీవో రాణి, పొల్యూషన్, సెబ్, ఇరిగేషన్, ఎస్ఈబీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి ఇవ్వాల్సిన డబ్బు ఏం చేశారు?

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, మే 21: రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ఈహెచ్ఎస్‌కు ఇవ్వాల్సిన డబ్బులన్నీ ఏం చేశారంటూ జగన్ ప్రభుత్వానికి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. బకాయిల కోసం ఆస్పత్రుల యాజమాన్యాలు ఏళ్ళ తరబడి మొత్తుకుంటున్నా పట్టించు కోకుండా ఏం చేస్తున్నారని నిలదీశారు. దాదాపు రూ.1500 కోట్లు వరకు రావాల్సిన బిల్లుల కోసం ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులు సేవలు నిలిపివేతకు నిర్ణయించిన నేపథ్యంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో వైసీపీ ప్రభుత్వ తీరును ప్రత్తిపాటి దుయ్యబట్టారు. ఐదు సంవత్సరాలుగా ఆస్పత్రులు కోరుతున్న సేవల రుసుములు పెంచకపోగా వందల కోట్ల రూపాయల బకాయిలు పెడితే వారు మాత్రం ఎలా మనుగడ సాగిస్తారో చెప్పాలన్నారు. పేదలకు మాత్రం ఆరోగ్యశ్రీ పరిమితి పెంచాం, సేవల పరిధిని విస్తరించాం అని గొప్పగా చెప్పుకొనే ప్రభుత్వం సేవలు అందించే ఆస్పత్రులకు బిల్లులు ఇవ్వకపోతే ఏం లాభమని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత కాంట్రాక్టర్లకు కమిషన్‌ల కోసం వేల కోట్ల రూపాయలు బిల్లులు చెల్లిస్తున్న జగన్ పేదల ఆరోగ్యానికి కాపు కాచే ఆరోగ్యశ్రీ విషయంలో మాత్రం ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. ప్రభుత్వం తక్షణం బిల్లులు చెల్లించని పక్షంలో ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రుల సేవలు నిలిచి పోయి ఏ ఒక్క ప్రాణానికి ఇబ్బంది వచ్చినా జగన్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని ప్రత్తిపాటి అన్నారు.

అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

- మృతుడి బంధువుల నిరసన



నిరసన తెలుపుతున్న మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

పొన్నూరుటౌన్, మే21: ఇటీవల పొన్నూరు పట్టణంలో చోటు చేసుకున్న సచివాలయ ఉద్యోగి అనుమానస్పద మృతిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి దోషులను శిక్షించాలని మంగళవారం మృతుడి బంధువులు నిరసనకు దిగారు. పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్‌లో మృతుడి బంధువులు న్యాయం కోసం నిరసన చేపట్టారు. కొలిపర మండలం, సిరిపురం గ్రామానికి చెందిన తులుమిల్లి కిషోర్ బాబు నిడుబ్రోలులోని సచివాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కిషోర్ బాబుకు చంద్రకళ అనే మహిళా పోలీస్‌తో వివాహం జరిగింది. ఇరువురు మధ్య మనస్పర్ధలు చోటు చేసుకోవటమే కాకుండా ఘర్షణలు సైతం జరిగాయి. ఇటీవల ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేసిన క్రమంలో అర్బన్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత రోజు కిషోర్‌బాబు నిడుబ్రోలులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో శవమై తేలాడు. ఈ సంఘటనలో కిషోర్‌బాబు బంధువులు కిషోర్‌ది ఆత్మహత్య కాదని, చంపి చెరువులో పడవేశారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అనుమానాస్పద మృతి కేసును హత్య కేసుగా మార్చి విచారణ చేపట్టి న్యాయం చేయాలని నిరసనకు దిగారు. శవ పరీక్షల నివేదిక అనంతరం కేసు సెక్షన్లను మార్చి విచారణ జరుపుతామని, న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వటంతో కిషోర్‌బాబు బంధువులు నిరసన విరమించారు.

మాచర్ల ఎమ్మెల్యేని తక్షణం అరెస్టు చేయాలి

- టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారు నాయక్

గుంటూరు, మే 21: ఈనెల 13న రెంటచింతల మండలం పాల్వాయి గేటు గ్రామం పోలింగ్ కేంద్రం (202)లో అధికారుల ముందే ఈవీఎంలు పగలకొట్టిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణా రెడ్డిని తక్షణం అరెస్టు చేయాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ డిమాండ్ చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, పారదర్శకంగా జరుగుతున్న ఎన్నికలను, భంగం చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపైనా, అతనికి సహకరించిన అనుచరులపైనా తగిన చర్యలు తీసుకుని, పాల్వాయి గేటులో రీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రెంటచింతల మండలం రెంటాల గ్రామంలో, వెల్దుర్తి మండలం కల్లకుంట గ్రామం, కొత్త పుల్లారెడ్డిగూడెం గ్రామం, ఇదే విధంగా దౌర్జన్యాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి ఎన్నికలు సజావుగా జరగకుండా అడ్డుకున్నారన్నారు. ఈ గ్రామాల్లో తిరిగి రీపోలింగ్ నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు.

వయస్సు 26.. చోరీలు 30..

- జల్సాలకు అలవాటుపడి బైక్ దొంగతనాలు
- నిందితుడి అరెస్టు.. రూ.2.50 లక్షలు విలువైన బైక్ స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న మట్వాడ పోలీసులు

వరంగల్, మే 21: జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు వరంగల్‌లోని మట్వాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా సంగడిగుంటకు చెందిన చాగంటి పవన్ తిరుమలేశ్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 26ఏళ్ల తిరుమలేష్ జల్సాలకు అలవాటుపడి తొమ్మిదేళ్లుగా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 30 కొత్త మోటార్ సైకిళ్లను దొంగిలించాడు. ఎవరైనా కొత్తబైక్ కొంటే వారితో మాటలు కలిపి ఒకసారి ట్రయల్ చేసి చూస్తానని నమ్మించి బైక్‌కు పరారవుతున్నాడు. ఇప్పటికే పలుమార్లు జైలుకు వెళ్లాడు. మే 9న ములుగురోడ్ ప్రాంతంలో హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన కామెర అరవింద్ తన యమహా బైక్ సర్వీసింగ్ కోసం రావడంతో నిందితుడు తిరుమలేష్ అతడిని పరిచయం చేసుకొని ఇలాగే నమ్మించి బైక్‌తో పరార్ అయ్యాడు. మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి, బైక్ స్వాధీనం పర్చుకొని జ్యుడీషియల్ రిమాండ్ పంపినట్లు తెలిపారు. కేసు చేదనలో ప్రతిభకనబర్చిన క్రైం కానిస్టేబుళ్లు అలీ, తిరుపతిలను సీఐ అభినందించారు.

నాటికల పోటీలు ప్రారంభం



ఇంద్రప్రస్థం నాటికలోని సన్నివేశం

పెదనందిపాడు, మే, 21: మండలంలోని వరగాని అంకమ్మగుడి ఆవరణలో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల 8వ ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రోటరీ మాజీ గవర్నర్ వడ్లమాని రాజ్యలక్ష్మీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళలను, కళాకారులను గత ఎనిమిదేళ్ళుగా ప్రోత్సహిస్తున్న కళాపరిషత్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. మొదటి రోజు తొలి నాటికగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక చూపరులను కంటతడి పెట్టించింది. ద్వితీయ నాటిక శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి కౌసల్యా సుప్రజారామా, తృతీయ నాటికగా తెలుగు కళాసమితి విశాఖ వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలుగా మానంపురి సత్యనారాయణ, ముసుగు నాగభూషణం, అనంత ఉదయరాజులు వ్యవహరించారు. అనంతరం అక్షయ పాఠశాల విద్యార్థులు భరత నాట్యం ప్రదర్శించారు. మాజీ రోటరీ గవర్నర్ వడ్లమాని రవిని దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ గౌరవాధ్యక్షులు ముద్దన రాఘవయ్య, అధ్యక్ష కార్యదర్శులు పోపూరి నాగేశ్వరరావు, చెరుకూరి సాంబశివరావు, కమిటీ సభ్యులు బండారు రాంబాబు, రోటరీ అధ్యక్షులు వై కోదండరామిరెడ్డి, సభ్యులు కొల్లా సాంబశివరావు, వై రమణయ్య, కొర్రపాటి రామారావు, చెన్నుపాటి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆ ఓట్లపై.. ఉత్కంఠ

- పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఈసారైన సక్రమంగా జరిగిందా..!
- గత ఎన్నికల్లో 50 శాతం పైగా చెల్లలేదు
- ఈ దఫా ఫెసిలిటేషన్ సెంటర్లలో సిబ్బంది ఓర్పుగా సలహాలు
- ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో ప్రక్రియలన్ని సక్రమంగానే చేయించారు
- ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏమి జరుగుతుందోనన్న ఉత్కంఠ

గుంటూరు, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెద్దఎత్తున జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. గత ఎన్నికల్లో ఉద్యోగులు వేసిన ఓట్లలో 50 శాతం పైగా చెల్లుబాటు కాలేదు. క్లరికల్ తప్పులు కారణంగా కౌంటింగ్ సమయంలో వాటిని పక్కన పెట్టేశారు. ఈ సారి ఎలాంటి తప్పులు దొర్లకుండా నిబంధనల మేరకు ఓటింగ్ చేశారా, లేదా అనేది జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా తేలిపోనుంది. ఈ దఫా ఫెసిలిటేషన్ సెంటర్లలో ఉద్యోగులు ఎంతో ఓర్పుగా కూర్చుని ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కారణంగా ఎక్కువ శాతం ఓట్లు తప్పక చెల్లుబాటు అవుతాయన్న ధీమా ప్రతీ ఒక్కరిలో నెలకొని ఉన్నది.

ఎన్నికల సంఘం తొలిసారిగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్‌లో 2,292మంది ఓటు హక్కు వినియోగించుకొన్నారు. ఇది కూడా పోస్టల్ బ్యాలెట్ విధానంలోనే జరిగింది. 85 ఏళ్ల వయస్సు దాటిన వారు, దివ్యాంగులు ఈ విధానంలో తొలిసారిగా ఓటు వేశారు. ఈ నేపథ్యంలో వీటిల్లో కొన్ని చెల్లుబాటు కాకుండా పోయే అవకాశం లేకపోలేదు. మరోవైపు జిల్లాలో పోలింగ్ సిబ్బంది 14287, పోలీసులు 1905, అత్యవసర సర్వీసుల్లో ఉన్న వారు 874, ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తూ ఇక్కడ ఓటు హక్కు ఉన్న 5092, ఇతర ఎన్నికల విధుల్లో ఉన్న వారు 2300 కలిపి మొత్తం 24462 పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకొన్నారు. వారిలో 20397 మంది ఓటు వేశారు. తాడికొండలో 1655, మంగళగిరిలో 2460, పొన్నూరులో 1928, తెనాలిలో 1882, ప్రత్తిపాడులో 1609, గుంటూరు పశ్చిమలో 4156, గుంటూరు తూర్పులో 2480, ఇతర జిల్లాల్లో ఉన్న వారు 4227 మంది ఓటు హక్కుని వినియోగించుకొన్నారు.

ఎన్నికల్లో ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఒక పార్టీ వైపు మొగ్గు చూపితే ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు అంతగా ప్రాధాన్యం ఉండదు. ఎప్పుడైతే ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు రెండు పార్టీల మధ్యన పోటా పోటీగా జరుగుతుందో అప్పుడు పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు ప్రాధాన్యం పెరుగుతుంది. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో ప్రభుత్వ ఉద్యోగుల్లో ఎక్కువ శాతం మంది ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారన్నది బహిరంగ రహస్యమే. ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లపై వైసీపీ నేతలకు కూడా ఆశలు లేవు. ఈ నేపథ్యంలో ఈవీఎం కౌంటింగ్‌లో పోటాపోటీగా జరిగితే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తప్పక టీడీపీకే లబ్ధిని చేకూర్చి పెడతాయి. కాగా ఈ దఫా ఫెసిలిటేషన్ సెంటర్లలో ప్రభుత్వ ఉద్యోగులు ఓటర్లకు అందుబాటులో ఉండి ఎన్నికల సంఘం ప్రక్రియలను విడమరిచి వివరించారు. ఓటర్లంతా దాదాపుగా వారు చెప్పిన నిబంధనలు పాటిస్తూ ఓటింగ్ చేశారు. దీని దృష్ట్యా అరకొర మినహా అన్ని ఓట్లు చెల్లుబాటు అయ్యే అవకాశం ఉందన్న ధీమాని ఉద్యోగులు వ్యక్తపరుస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	158, 167,178
చికెన్ విత్ స్కిన్	306.00
చికెన్ స్కిన్ లెస్	316.00

బాపట్ల వార్తలు

తూర్పుసత్రం భూమి లీజును రద్దు చేయాలి

● దేవదాయ శాఖ కమిషనర్‌కు మాజీ ఎమ్మెల్సీ సతీష్ వినతి


దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల,మే 21 : బాపట్ల పట్టణ నడిబొడ్డున ఉన్న తూర్పుసత్రం భూమి లీజును వెంటనే రద్దు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ మంగళవారం దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. పూర్వం పేరం గరుడాచలం నాయుడు దానం చేసిన తూర్పుసత్రం భూమిలో 78 సెంట్లు నెలకు 46 వేల రూపాయల చొప్పున ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారికి లీజుకివ్వటాన్ని అన్నం సతీష్ తీవ్రంగా ఖండించారు. బాపట్ల పరిసర ప్రాంతాలలోని పేదలు, సొంత ఇల్లు లేని వారు, ఇతరులు దశదిన కర్మలు నిర్వహించుకోవటానికి, పేద వితంతు మహిళలు ఆ సమయంలో తలదాచుకోవటం కొరకు, పేద విద్యార్థులకు పారితోషకాలు ఇవ్వటం కొరకు ఏర్పాటు చేసిన సంపూర్ణ ధార్మిక సంస్థ తూర్పుసత్రమని ఆయన అన్నారు. ప్రస్తుతం సదరు స్థలంలో ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వారికి ఆయిల్ అవుట్‌లెట్ కొరకు అత్యంత విలువైన స్థలాన్ని అతి తక్కువ నామమాత్రపు లీజుకిచ్చారన్నారు. సదరు సంస్థ వారు ఆయిల్ ఔట్‌లెట్ పెట్టటం వలన కర్మకాండల కొరకు వచ్చే ప్రజలు కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందిగా ఉంటుందని అన్నం సతీష్ అన్నారు. ఇప్పటికే తాత్కాలిక లీజుపై జాతీయ రహదారి నిర్మాణం చేస్తున్న గుత్తేదారు సంస్థ మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయటం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పక్షాలు, కాపుసేవాసంఘంవారు సదరు లీజును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. దాత ఆశయాలను నెరవేర్చుటకు, ఆస్తులు పరిరక్షణ చేయవల్సిందిగా అన్నం సతీష్ కోరారు. హిందూ సమాజం, కాపు సామాజిక వర్గం మనోభావాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం లీజును తక్షణమే రద్దు చేసి సత్రం భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ ప్రజల మనోభావాలకు అనుగుణంగా పని చేస్తానని సానుకూలంగా స్పందించినట్లు అన్నం సతీష్ తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యసేవలు

● డాక్టర్ ఎం.గోపినాథ్


డాక్టర్ గోపినాథ్

కర్లపాలెం, మే 21 : కర్లపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు 24 గంటలు వైద్య సేవలందిస్తామని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ ఎం.గోపినాథ్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్, ఎనిమియా, గర్భిణులకు సంబంధించిన సేవలు, పాము, తేలు కాటుకు చికిత్స, రక్తహీనతకు ఐరన్, సూక్రోజ్ ఎక్కించుట, అత్యవసరమైన చికిత్సలు, దీర్ఘకాలిక వ్యాధులకు అవసరమైన మందులను అందిస్తామని, ఆయా సేవలన్నీ ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంటాయని, స్టాఫ్ నర్సుల ద్వారా వైద్య సేవలందిస్తామని డాక్టర్ గోపినాథ్ తెలిపారు. మండల ప్రజలు కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అందించే వైద్యసేవలను అందుకోవాలని గోపినాథ్ తెలిపారు.

పొన్నవాహనంపై కొలువుతీరిన భావదేవుడు


పొన్నవాహనంపై ఊరేగుతున్న భావదేవుడు

బాపట్ల, మే 21 : పట్టణంలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత క్షీరభావన్నారాయణస్వామి 1431వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారు పొన్నవాహనంపై కొలువుతీరారు. అర్చకస్వాములు శ్రీనివాసుల విఖనస మూర్తి, నల్లూరి విజయసారధి, నల్లూరి పాంచజన్యం, బృందావనం గోపిచంద్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారిని పొన్నవాహనంపై నగరోత్సవం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు దేశిరాజు వెంకటరమణబాబు, ఈవో డి.వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శ్రీప్రసన్నాంజనేయస్వామికి లక్ష మల్లెలతో అర్చన


శ్రీప్రసన్నాంజనేయస్వామివారికి నాగవల్లి దళాలు లక్షమల్లెపూలతో అర్చన చేసిన చిత్రం

కర్లపాలెం, మే 21 : మండలంలోని ఏట్రవారిపాలెం పంచాయతీ కొత్తరాజులపాలెంలో ఉన్న శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో ఉన్న శ్రీ సువర్చల సమేత శ్రీప్రసన్నాంజనేయస్వామికి పూజారి అగ్నిహోత్రం అప్పలచార్యులు కుమారస్వామి ఆధ్వర్యంలో నాగవల్లి దళాలు, లక్షమల్లె పూలతో అర్చన కార్యక్రమాన్ని వందలాది మంది భక్తుల నడుమ మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి అభిషేక కార్యక్రమాలు, పూజా కార్యక్రమాలను భక్తుల నడుమ కన్నుల పండుగగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి స్వామి వారి ప్రసాదం, సిందూరం, స్వామి వారి రక్షలు, స్వామి వారి రూపులు ప్రసాదంగా అందించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం

తెనాలి అర్బన్, మే 21 : పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం వైశ్య విద్యానిధి హాస్టల్‌లో కల్పించామని కమిటీ కార్యదర్శి పెండేల వెంకట్రావు తెలిపారు. తెనాలి బస్‌స్టేషన్ సమీపంలోని శ్రీకన్యకా పరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ ఆధ్వర్యంలో దరఖాస్తులు ఇస్తున్నామని అర్హులైన వారు సంప్రదించాలని కోరారు. తెనాలి, జిల్లా, రాష్ట్రం, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు కూడా ఈ అవకాశం ఉందన్నారు. వైశ్య విద్యానిధిలో చేరి వసతి పొంది తెనాలితో పాటు పరిసర ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో ఇంటర్ నుంచి ఇంజనీరింగ్ వరకు చదువుకునే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా అందిన దరఖాస్తుదారుల నుంచి 100 మందిని ఎంపిక చేసి వసతి కల్పిస్తామన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి

తెనాలి అర్బన్, మే 21 : పట్టణంలోని నాజరుపేటలోని లక్ష్మీనరసింహస్వామి జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. జయంతి పురస్కరించుకుని స్వామి వారికి అభిషేకాలు, చందనోత్సవం, సహస్రనామార్చన, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. జూన్ 1న హనుమత్ జయంతి నిర్వహించి, జూన్ 5న స్వామి వారి కళ్యాణం జరుపుతామని కమిటీ సభ్యులు తెలిపారు. జయంతోత్సవంలో చంద్రశేఖరరెడ్డి, చైర్‌పర్సన్ రాధిక, రమేష్ దంపతులు, కౌన్సిలర్ త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల నటుడు ఆదినారాయణకు సన్మానం

తెనాలి అర్బన్, మే 21 : పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి ఉత్సవాలలో ప్రముఖ రంగస్థల కళాకారుడు ఆరాధ్యుల ఆదినారాయణను ఘనంగా సన్మానించారు. రూరల్ మండలం కఠెవరంలో గుడి కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. తాడిబోయిన నాగేశ్వరరావు, భవానీ శంకర్, సుబ్రహ్మణ్యం, ఫణికుమార్, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.


భావన్నారాయణస్వామి నూతన రథ నిర్మాణానికి సంబంధించిన గోపురాలు


నూతన రథచక్రాలు సిద్ధం చేస్తున్న కార్మికుడు

రూ.కోటి 15 లక్షలతో భావదేవుని నూతన రథ నిర్మాణం

● ఈ ఏడాది నూతన రథంపై ఉత్సవం లేనట్టే..?

● పాత రథంపైనే రథోత్సవం


రథానికి అమర్చే చెక్కలపై బొమ్మలు చెక్కుతున్న శిల్పులు

బాపట్ల, మే 21 : పట్టణంలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయ నూతన రథనిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఆలయ మరమ్మతులు పూర్తి చేసి నూతన గాలిగోపురం నిర్మాణం కూడా పూర్తి చేశారు. రథం పాతది కావటంతో దాని స్థానంలో నూతన రథాన్ని నిర్మించాలని సంకల్పించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమానికి కాంట్రిబ్యూషన్‌గా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ రూ.15 లక్షలు అందజేశారు. దీంతో దేవదాయశాఖ రూ.85 లక్షల సీజీఎఫ్ గ్రాంట్‌ను విడుదల చేసింది. మొత్తం కోటి రూపాయలతో నిర్మించతలపెట్టిన రథం నిర్మాణ పనులకు మరికొందరు దాతలు ముందుకొచ్చి మరో రూ.15 లక్షల విరాళం అందజేశారు. దీంతో మొత్తం కోటి 15 లక్షల రూపాయలు వెచ్చించి నూతన నిర్మాణ పనులు ఆలయకమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈవో డి.వెంకటేశ్వర్లు, దేవదాయశాఖాధికారుల సూచనల మేరకు చేయిస్తున్నారు. దీని నిర్మాణానికి అత్యంత ఖరీదైన కలపను వినియోగిస్తున్నారు. చెక్కలపై బొమ్మలు చెక్కేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి శిల్పులను తీసుకొచ్చారు. ఆయా ప్రాంతాల శిల్పులు తమకు కేటాయించిన పనులను చాకచక్యంగా, అత్యంత సుందరంగా చేస్తూ రథాన్ని పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి అయినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం భావన్నారాయణస్వామి 1431వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈనెల 22వ తేదీన స్వామి వారి కల్యాణమహోత్సవం, 23వ తేదీ భావయ్య పౌర్ణమి సందర్భంగా శ్రీవారి దివ్యరథోత్సవం జరుగుతుంది. రథోత్సవం నాటికి నూతన రథనిర్మాణం పూర్తియ్యేనా అని భక్తులు చర్చించుకుంటున్నారు. ఈ ఏడాది నూతన రథంలో భావదేవుని ఊరేగింపు చేయాలని భావించినప్పటికి నిర్మాణం పూర్తికాకపోవటం వల్ల పాతరథంలోనే ఉత్సవం జరిపే అవకాశం ఉందని ఈవో డి.వెంకటేశ్వర్లు తెలిపారు. నూతన రథం పూర్తి కావటానికి ఇంకా నెలరోజులకు పైగా పడుతుందన్నారు. ప్రస్తుతం ఈ రథాన్ని తూర్పుసత్రం ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిర్మిస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన పాండురంగాపురం ఎత్తిపోతల నీటిపైపులు


ఎత్తిపోతల పథకానికి సంబంధించిన నీటిపైపులు శిథిలావస్థకు చేరిన చిత్రం

బాపట్ల రూరల్, మే 21 : బాపట్ల పేరలి డ్రైన్ కాల్వపై ఉన్న పాండురంగాపురం ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సాగునీటి భారీపైపులు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరి విరిగిపోతూ ఉన్నాయి. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా ఎన్నో వేల ఎకరాల రైతులు ఆధారపడి పంటసాగు చేస్తున్నారు. ఈ భారీ ఇనుపపైపులు తుప్పు పట్టటంతో రంధ్రాలు ఏర్పడిన చోట పరదాలు కట్టారు.

అయినప్పటికి నీటి వేగానికి అవి ఉండటం లేదు. ఇదే సమస్య భావపురి ఎత్తిపోతల పథకంలో కూడా ఉంది. వర్షాలు మొదలవ్వటం, వరి పంటలు వేసుకునేందుకు రైతులు సిద్ధమౌతున్నారు. సంబంధిత ఇరిగేషన్ శాఖ వారు, సంబంధితాధికారులు వెంటనే ఈ ఎత్తిపోతలకు సంబంధించిన సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

రేపు శ్రీ క్షీరభావన్నారాయణస్వామి అన్న సంతర్పణ కార్యక్రమం


ప్రత్యేక అలంకరణలో శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత క్షీరభావన్నారాయణస్వామి

బాపట్ల, మే 21 : శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి వారి 1431 వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 4 గంటలకు శ్రీవారి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు భావపురి అయ్యప్పస్వామి సేవాసంఘం అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుంది. భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించాలని మంగళవారం ఆలయ ప్రాంగణంలో బాబునాగేంద్ర, గురుస్వామి కె.సుబ్బారావు, వక్కలగడ్డ శ్రీనివాసరావు, దేవరాజు వెంకటరమణబాబు, నాగేశ్వరరావు విలేకర్ల సమావేశంలో తెలిపారు. అదేవిధంగా గురువారం సాయంత్రం 4 గంటలకు శ్రీవారి దివ్య రథోత్సవం జరుగుతుందని, భక్తులు వేలాదిగా పాల్గొనాలని వారు కోరారు.

ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవికుమార్

కర్లపాలెం, మే 21 : కర్లపాలెం రాజీవ్‌నగర్‌కు చెందిన కుమ్మరికుంట రవికుమార్‌ను ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల ప్రొటెక్షన్ మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా రాజారావు నియమించారని, నియమాక పత్రాన్ని అందజేశారని రవికుమార్ మంగళవారం తెలిపారు.

వివాహ ప్రాప్తి కొరకు హరింద్ర శృంగార అర్చన


శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, మే 21 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో వివాహం కాని యువతులు, యువకులకు ప్రతిమాసంలో మంగళ, శుక్రవారాల్లో శీఘ్రంగా వివాహ ప్రాప్తి కొరకు హరింద్ర శృంగార అర్చన, పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. యువతీ, యువకులు 9 వారాలపాటు ఈ పూజ కార్యక్రమాలు నిర్వహించుకొనుట మంచిదని, పూజా కార్యక్రమాలు చేయించుకోనటానికి అవకాశం లేని వారు వారి తల్లిదండ్రుల ద్వారా ఈ పూజా కార్యక్రమాలు జరిపించుకోవచ్చునని ఆయన చెప్పారు. ఉదయం 9 గంటలు నుంచి ఈ పూజా కార్యక్రమాలు ప్రారంభమౌతాయని తెలిపారు. ఇతర వివరాలకు ఆలయంలో సంప్రదించాలని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి

● 9 బైక్‌లు, రూ.2 వేల నగదు స్వాధీనం

బాపట్ల రూరల్, మే 21 : బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామశివారులో నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై బాపట్ల రూరల్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు పందెంకోళ్ళు, తొమ్మిది ద్విచక్ర వాహనాలు, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ వై.శ్రీహరి తెలిపారు.

ప్రమాద భరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు

● ఫెన్సింగ్ ఏర్పాటు చేయని విద్యుత్ అధికారులు

● వేలాడుతున్న విద్యుత్ వైర్లు


నిజాంపట్నం రోడ్డులోని రామశాస్త్రి కల్యాణ మండపం వద్ద ఫెన్సింగ్ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


ఓపెన్ థియేటర్ ఎదురు రోడ్డులో ఫెన్సింగ్‌లేక ప్రమాద భరితంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

రేపల్లె, మే 21 : నిత్యం వేలాది మంది విద్యార్థులు పాఠశాలలకు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ లేకపోవటంతో ప్రమాద భరితంగా ఉన్నాయి. రేపల్లె పురపాలక సంఘంలో 28 వార్డులు ఉండగా వార్డుకు రెండు,మూడు చొప్పున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. పాఠశాలలు పునఃప్రారంభం సమయం దగ్గర పడటంతో విద్యార్థులు రాకపోకలు సాగించే రహదారులలోనే నేలకు తక్కువ సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిన వైర్లు క్రిందకి ఉండటం, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ లేకపోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని ఓపెన్ థియేటర్ ఎదురురోడ్డులో, అరవపల్లి రోడ్డులోని కోతమిషన్ వద్ద, 25వ వార్డులోని మసీద్ సమీపంలో, రామకోటిపేట రామాలయం సమీపంలో, చంద్రమౌళిపార్కు వెనుక రోడ్డులో, పోస్టాఫీసు రోడ్డులో పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఒక్కచోటకూడా ఫెన్సింగ్ లేదు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్‌వైర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాద భరితంగా ఉన్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు దృష్టి సారించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.


కోత మిషన్ వద్ద విద్యుత్ వైర్లు కిందకి ఉండటం, ఫెన్సింగ్‌లేని ట్రాన్స్‌ఫార్మర్

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

● చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు

భట్టిప్రోలు, మే 21 : అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మిక కుటుంబాలను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని, కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు మురుగుడు సత్యనారాయణ, దీపాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. భట్టిప్రోలు చేనేత సొసైటీ వర్క్‌షెడ్‌లో మంగళవారం నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూలు, రంగులు, రసాయనాలపై, చేనేత వస్త్రాలపై జీఎస్టీని విధించడం కారణంగానే ఉపాధి లేక అనంతపురం జిల్లాకు చెందిన కుళ్ళాయప్ప ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత వస్త్రాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని అమ్మకాలు లేక చేనేత వస్త్రాల నిల్వలు పేరుకుపోయాయన్నారు. కార్మికులు ఉపాధి లేక అప్పులపాలవుతున్నారని, అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో సోమవారం కుళ్ళాయప్ప ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. నూలు, రంగులు, రసాయనాలు, వస్త్రాలపై విధించిన జీఎస్టీని ఎత్తివేయాలని నాయకులు కోరారు. తమిళనాడు రాష్ట్రంలో ఇస్తున్న విధంగా యార్న్ సబ్సిడీ అందించాలని, గతంలో చేనేతకు ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బట్టు నాగమల్లేశ్వరరావు, నాయకులు ఆకురాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

కొల్లూరు, మే 21 : పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. మండలానికి 90 క్వింటాళ్ల జనుములు, 40 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు సరఫరా అయినట్లు ఏవో తెలిపారు. కొల్లూరు, క్రాప, దోనేపూడి, రావికంపాడు, ఈపూరు, జువ్వలపాలెం, పోతార్లంక, గాజుల్లంక రైతు భరోసా కేంద్రాలకు వాటిని సరఫరా చేయడం జరిగిందన్నారు. కావాల్సిన రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రాయితీ ధర కిలో రూ.44, పిల్లిపెసర రూ.67లుగా నిర్ధారించడం జరిగిందన్నారు. ఐదు ఎకరాల వరకు ఒక్కో రైతు సబ్సిడీ విత్తనాలను పొందవచ్చన్నారు. జనుము 10 కిలోలు, పిల్లిపెసర 8 కిలోల సంచులు ప్యాకింగ్ చేసి వచ్చినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యం వహించకూడదు

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయమ్మ

రేపల్లె, మే 21 : గర్భవతులు, బాలింతలు పట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ అన్నారు. స్థానిక రేపల్లె డివిజన్‌లోని వైద్యశాలలో మంగళవారం ఆమె ప్రాథమిక ఆరోగ్య శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భవతులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని వైద్యసేవలను సక్రమంగా అందించాలని సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యం వహి స్తే ఉపేక్షించేది లేదన్నారు. తల్లిబిడ్డలు ఇంటికి క్షేమంగా చేరే వరకు బాధ్యత మీరే వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం కోట్లరూపాయలు వెచ్చించి పేద ప్రజలకు వైద్యం సేవలు అందిస్తుందని, సిబ్బంది దీనికి అనుగుణంగా అలసత్వం వహించకుండా విధులు నిర్వహించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డాక్టర్ జీవన్‌లత, డాక్టర్ రవిబాబు, డాక్టర్ అబ్దుల్ సమాద్, డాక్టర్ కిషోర్, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ జాన్ ప్రసాద్, డాక్టర్ నాగార్జున, డాక్టర్ తల్లా సాయిబాబు, డాక్టర్ శ్రావణ్య, డాక్టర్ నజీరా, డాక్టర్ తులసి, డాక్టర్ మంజూ, డాక్టర్ భావన, డాక్టర్ సలేహా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ

నేటి నుంచి గుండిపార్వతి అమ్మవారి వార్షిక ఉత్సవాలు


ప్రత్యేక అలంకారంలో గుండిపార్వతి అమ్మవారు

భట్టిప్రోలు, మే 21 : స్థానిక హిందూ శ్మశాన వాటికలో ఉన్న శ్రీ గుండిపార్వతి అమ్మవారి వార్షిక ఉత్సవాలకు దేవాలయం ముస్తాబైంది. వార్షిక ఉత్సవాలలో భాగంగా 22న అమ్మవారి పసుపు, కుంకుమ బండ్లు ఊరేగింపు పవిత్ర నదీస్నానం, గ్రామోత్సవం, 23న ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం నిత్య పూజ, చద్దినైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించడం జరుగుతుంది. రాత్రి దేవస్థానం ఆవరణలో భారీ విద్యుత్ ప్రభల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం అభివృద్ధి కమిటీ వారు తెలియజేశారు. గుండిపార్వతి అమ్మవారి వార్షిక ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కాపు సంఘీయులు కోరారు.


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న కార్డ్స్ సంస్థ ప్రతినిధులు

బాలబాట అభివృద్ధికి తోడ్పడాలి

వేమూరు, మే 21 : బాలబాట కో ఆర్డినేటర్లు బాలబాట కార్యక్రమాల నిర్వహణకు తోడ్పడాలని కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలియజేశారు. వేమూరు అంబేద్కర్ బాలబాట సెంటర్లో మంగళవారం బాలబాట కార్యకర్తల నెలవారీ సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాలబాట కార్యక్రమాల ద్వారా పేద దళిత విద్యార్థులకు విద్యనందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. బాలబాట కో ఆర్డినేటర్లు ఆయా సెంటర్లో బాలబాట కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్డ్స్ సంస్థ ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేమూరు, మే 21 : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని వేమూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తాడికొండ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. టెక్నాలజీ పరంగా దేశం గర్వించదగే రీతిలో రాజీవ్‌గాంధీ పని చేశారన్నారు. నేటి రాజకీయ నాయకులు రాజీవ్‌గాంధీని ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లోకి ముందుకు సాగాలని దేశ ప్రతిష్ఠను పెంచే విధంగా పని చేయాలని సూచించారు. నివాళులర్పించిన వారిలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోపి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ విఠలేశ్వర్

పార్టీల ప్రతినిధులు సంయమనం పాటించాలి

ఏఎస్పీ విఠలేశ్వర్

చీరాలటౌన్, మే 21 : ఓట్ల లెక్కింపు ముందు, అనంతరం అన్ని పార్టీల ప్రతినిధులు సంయమనం పాటించి శాంతి వాతావరణం ఉండేలా సహకరించాలని ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్ విజ్ఞప్తి చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో సమావేశంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా హింసాత్మక ప్రాంతాలను గుర్తించామని, ప్రత్యేక నిఘా, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే పలు ఘటనలకు సంబంధించి అనేక మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే కఠినమైన కేసులతో పాటు జిల్లా బహిష్కరణ ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, టూటౌన్ సీఐ సోమశేఖర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించి..!

- లోగ్రేడ్ ధరకే పరిమితమైన నాణ్యమైన పొగాకు
- ఆందోళనలో వైట్‌బర్లీ రైతులు
- ధర కోసం ఎదురుచూపు



పర్చూరులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పొగాకు

పర్చూరు, మే 21 : ఒక పక్క ప్రకృతి వైపరీత్యాలు, మరో పక్క వాతావణ పరిస్థితులు, అధిక పెట్టుబడులు వెరసి రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి. వేలకు వేల పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న రైతులకు సరైన ధరలేకపోవడంతో నష్టాలపాలు కావాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వేల ఎకరాల్లో సాగు చేసుకున్న వైట్ బర్లీ పొగాకు రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. పంట చేతికి వచ్చిన తరుణంలో లోగ్రేడ్ పొగాకు క్వింటాకు రూ.14వేలు పైచిలుకు పలకడంతో సాగుచేసుకున్న రైతులకు ఎంతో ఊరటనందించింది. దీంతో నాణ్యమైన వైట్‌బర్లీ పొగాకుకు మంచి ధర పలుకుతుందని ఆశపడ్డారు. ఆశ కాస్త అడి ఆశగా ప్రస్తుత పరిస్థితి నెలకొంది. లోడ్ గ్రేడ్ ధరకు మించి నాణ్యమైన పొగాకు కొనుగోలు జరగడం లేదు. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. ఎన్నికల నేపథ్యంలో కొనుగోలుదారులు ముందుకు రావడం లేదని రైతులు అనుకున్నారు. ఎన్నికలు ముగిసినా ధరల పెరుగుదలలో మార్పులేకపోవడం, కొనుగోళ్లు కూడా మందకుడిగా సాగడంతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది. మరో పక్క వర్షాల నేపథ్యంలో చేతికి అందివచ్చిన పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో వైట్‌బర్లీ పొగాకుకు నాణ్యమైన ధర ఉన్నా వ్యాపారులు సిండికేట్‌గా మారడం వల్లే ధరలు ఇలా దిగజారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క వ్యవసాయ సీజన్ సమీపిస్తుండడంతో పెట్టుబడుల కోసం విక్రయాలు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

ధరపైనే రైతుల ఆశ

ప్రస్తుతం వ్యవసాయ ఖర్చులు, నామమాత్రపు దిగుబడుల నేపథ్యంలో ధర అనుకూలంగా ఉంటేనే పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి. గత ఏడాది వ్యవసాయ సీజన్ ముగిసే సమయంలోనాణ్యమైన పొగాకు క్వింటా రూ.18వేలకు కొనుగోలు చేశారు. దీంతో ఈఏడాది కూడా అనుకున్న మేర ధర ఉంటుందన్న ఆశతో రైతులు వ్యయ ప్రయాశలకోర్చి వేల ఎకరాల్లో వైట్‌బర్లీ పొగాకును సాగు చేశారు. ప్రస్తుతం ఉన్న ధరలతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది.



సర్వేను పరిశీలిస్తున్న ఎంఈవో రమేష్

వైకల్య విద్యార్థుల సర్వే

బల్లికురవ, మే 21 : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం భవిత కేంద్రం అందుబాటులో ఉందని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంఈవో రమేష్ తెలిపారు. మంగళవారం బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో పూర్తి వైకల్యం ఉన్న విద్యార్థుల గుర్తింపునకు భవిత కేంద్రం సిబ్బంది చేస్తున్న సర్వేను ఎంఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో ఇప్పటికే ఆరేళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్న విద్యార్థులు 134 మంది ఉండగా కొత్తగా మరో 34 మంది తమ సర్వేలో నమోదయ్యారని, వారందరికీ ప్రభుత్వం నుంచి వచ్చే పలు రకాల రాయతీలను అందిస్తామన్నారు. బల్లికురవ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భవిత కేంద్రం ఉందని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను అక్కడకి పంపిస్తే మిగతావారితో సమానంగా విద్యను అందిస్తామన్నారు. మంచంపై కదలలేని స్థితిలో ఉన్న విద్యార్థుల ఇళ్లకు వచ్చి విద్యను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈవో తెలిపారు. గ్రామాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఉంటే వెంటనే భవిత కేంద్రానికి సమాచారం ఇవ్వాలని ఎంఈవో సూచించారు. ఈసర్వేలో ఐఈఆర్‌పీఎస్ పి.నాగబాబు, జి.నాజిని పాల్గొన్నారు.

బాలాజీ కుటుంబానికి అండగా ఉంటాం

చీరాలటౌన్, మే 21 : మత్స్యకారుడి మృతి ఆ కుటుంబానికి తీరనిలోటని తప్పక వారికి అండగా ఉంటామని చీరాల కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. సోమవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి వేటపాలెం మండలం ఊటుకూరి సుబ్బయ్యపాలెంకు చెందిన ఊటుకూరి బాలాజీ(55) మృతి చెందారు. చీరాల ఏరియా హాస్పిటల్‌లో ఉన్న మృతదేహాన్ని మంగళవారం ఆమంచి పరిశీలించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని, కుటుంబానికి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆయన వెంట పలువురు నాయకులు, వర్గీయులు ఉన్నారు.

వేసవి శిక్షణను వినియోగించుకోవాలి



శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు శ్రీబాబు

చినగంజాం, మే 21 : శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు అన్నారు. శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు ఉల్లాసంగా, ఉత్సహంగా సాగుతున్నాయి. వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులు వినియోగించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని గ్రంథపాలకులు కోరారు. వేసవి శిక్షణ తరగతులలో భాగంగా విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయుడు పి.శ్రీబాబు చేతిరాత, తెలుగు భాష, భావ వ్యక్తీకరణ, వై.రామాంజనేయులు కంప్యూటర్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకయ్య ఆశ్రమానికి నిత్యావసరాల పంపిణీ

మార్టూరు, మే 21: విజయనగర్ కాలనీలో వెంకయ్య ఆశ్రమానికి మంగళవారం ఉపాధ్యాయుడు గరిమిడి శ్రీనివాసరావు దంపతులు పెళ్లిరోజు సందర్భంగా, రొటేరియన్ బీ అశ్వనీకుమార్ పుట్టినరోజు సందర్భంగా నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు సాంబశివరావు, రావి అంకమ్మ చౌదరి, నాగేశ్వరరావు, కాజా హుస్సేన్, జాష్టి సాంబ శివరావు, కొర్రపాటి కాజారావు చెరుకూరి అంజి బాబు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు

పర్చూరు, మే 21 : రైతులకు అవసరమైన పచ్చిరొట్ట ఎరువులు సబ్సిడీపై అందజేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి ఎస్.రామమోహన్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు వాడకం వల్ల భూమి సారవంతం అవుతుందని తద్వారా నాణ్యమైన దిగుడులు పొందేందుకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. 50 శాతం సబ్సిడీపై అందిచే విధంగా భరోసా కేంద్రాల్లో సిద్ధం చేసినట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రోటరీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగను పంపిణీ చేస్తున్న వైద్యులు, రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, మే 21 : సామాజిక కార్యక్రమాలల్లో రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్‌కుమార్ అన్నారు. మంగళవారం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పేదలకు తమ వంతు సాయంగా వైద్యశాలలోని రోగులకు విశ్రాంత ఉపాధ్యాయిని యనమండ్ర వరలక్ష్మి సౌజన్యంతో ఉచింగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులతో పాటు రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్, షేక్ మహమ్మద్ రఫీ, జ్యోతి చంద్రమౌళి, మాలాది శ్రీనివాసరావు, తమ్మ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సహకరించండి

రామాపురం(చీరాలటౌన్), మే 21 : చీరాల పరిధిలో నేరాల నియంత్రణకు లాడ్జి నిర్వాహకులు, రిసార్ట్స్ నిర్వాహకులు సహకరించాలని రూరల్ సీఐ సత్యనారాయణ అన్నారు. మంగళవారం రాత్రి వాడరేవు, రామాపురం ప్రాంతాల్లోని నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు జరిగే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలో నియోజకవర్గంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. అందుకు సంబంధించి అనుమానితులను గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆధారాలు లేకుండా రూములు అద్దెకు ఇవ్వరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు శివకుమార్, సురేష్, లాడ్జి, రిసార్ట్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ సత్యనారాయణ



క్రీడా ప్రాంగణంలో సేద తీరుతున్న పశువులు

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

- టీడీపీ హయాంలో ఏర్పాటు
- వైసీపీ వచ్చాక పట్టించుకోని వైనం
- అందుబటులోకి తేవాలని క్రీడాకారుల విజ్ఞప్తి

పర్చూరు, మే 21 : గ్రామీణ క్రీడాకారులకు శిక్షణను అందించి జాతీయ స్థాయిలో వారు రాణించేలా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఎన్టీఆర్ క్రీడా వికాశం పేరుతో రూ.2కోట్ల పైచిలుకు నిధులతో ప్రాంగణాన్ని నిర్మించారు. అయితే తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దీనిని పట్టించుకోకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి ఎలాంటి అలానా పాలనకు నోచుకోక నిరుపయోగంగా మారింది. భవనం చుట్టూ చిల్లచెట్లు, ముళ్ల పొదలు అలముకున్నాయి. ఈలోపు ఎన్నికల పుణ్యమా అని అధికారుల కన్ను పడింది. క్షణాల్లో ఆగమేఘాలమీద క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణ, సమావేశాలను ఈ భవనంలో నిర్వహించుకున్నారు. దీంతో క్రీడా ప్రాంగణం అధికారులతో కళకళలాడింది. ఎన్నికలు ముగియడంతో యథారాజా తదా ప్రజా అన్నట్లు పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ప్రస్తుతం పశువులతో ప్రాంగణం దర్శనమిస్తోంది. ప్రాంగణంలో పశువులను తోలడంపై క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

విశేష అలంకరణలో భీమలింగేశ్వరస్వామిఅమ్మవారు





పంగులూరు, మే 21 : పంగులూరులో శ్రీ భీమలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవరోజు మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా స్వామి అమ్మవారికి విశేషాలంకరణ గావించారు. ఉదయం నిత్యోపాసన, బలిహరణ, గ్రామోత్సవం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన, స్వామివారిని పెళ్లి కుమారునిచేసే కార్యక్రమలు శాస్త్రోక్తంగా జరిగాయి. సాయంత్రం ఆలయ బలిహరణ, గ్రామోత్సవం అనంతరం రాయబారం గావించి స్వామివారి దివ్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులు స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని తిలకించి పులకించారు. రాయబారం కార్యక్రమ వ్యాఖ్యాతగా శ్రీమాన్ నకరికంటి గోపి శరవణశర్మ వ్యవహరించగా, బ్రహ్మశ్రీ శైవాగమ పండితులు పేటేటి ఉదయభాస్కర శర్మ నేతృత్వంలో కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాలలో ఆలయ ఈవో ఉప్పలమర్తి శ్రీనివాసరావు, అర్చక స్వాములు చందలూరి సునీల్‌కుమార్ శర్మ, కారంచేటి సాంబశివరావులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

1న శ్రీ వీరాంజనేయస్వామి తిరునాళ్ల

మార్టూరు, మే 21 : మండల పరిధి బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల మధ్య కొండపై వెలసిన శ్రీవీరాంజనేయస్వామి తిరునాళ్లను వచ్చే నెల 1వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 29వ తేదీ నుంచి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం 1వ తేదీన శ్రీ సువర్చలా సహిత వీరాంజనేయస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. అదే రోజు రాత్రి కోలాటం, ఎడ్ల బల ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నూతన భవనం నుంచి విధులు



విధులు నిర్వహిస్తున్న సుభద్ర

అద్దంకి, మే 21 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం అధికారులు, సిబ్బంది మంగళవారం నుంచి నూతన భవనంలో విధుల నిర్వహణను ప్రారంభించారు. ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర మంగళవారం ప్రత్యేక పూజల అనంతరం నూతన భవనంలో విధులు నిర్వహణ ప్రారంభించారు. ఇప్పటి వరకు దేవాలయం ప్రాంగణంలో ఉన్న ఇరుకు గదులలో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా రు. దక్షిణ రాజగోపురం ఎదురు అన్నదాన మండపం పక్కన ఉన్న నూతన భవనంలోకి మంగళవారం మార్పు చేశారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాలటౌన్, మే 21 : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూహక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చట్టం అమలు జరిగితే భూ హక్కులు రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే వ్యతిరేకత ఉన్నట్లు చెప్పారు. వెంటనే దీనిని రద్దు చేసి ప్రజలకు, భూ హక్కుదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమం లో ఏఐటీయూసీ నాయకులు బత్తుల శామ్యేల్, సీఐటీయూ నాయకులు వసంతరావు, హేమసుందరరావు, పుష్పరాజ్, వాసు, మాచర్ల మోహన్‌రావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కట్టా రాజ్‌వినయ్‌కుమార్, మేడా వెంకటరావు, హరిహరరావు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల

స్వామివారి శాంతి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, అమ్మవారు



పంచముఖ ఆంజనేయస్వామి

మార్టూరు, మే 21 : మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి 33వ తిరునాళ్ల వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏటా గ్రామంలో ప్రజలు స్వామి వారి తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ ఏడాది కూడా తిరునాళ్లను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ తిరునాళ్లకు గ్రామానికి చెందిన వారు ఇతర ప్రాంతాలలో నివసించేవారు తప్పని సరిగా కార్యక్రమానికి వస్తారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటా బంధువులతో స్నేహితులతో పండుగ వాతావరణం, సందడి కనిపిస్తుంది. మంగళవారం నుంచి ప్రారంభమైన తిరునాళ్ల కార్యక్రమంలో భాగంగా ఉదయం దేవస్థానంలో హరినామ సంకీర్తన, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం ఉదయం గ్రామంలోని కొండపై వేంచేసి ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఉదయం 9 గంటలకు స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహిస్తారు. ఆలయంలో ఉన్నలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు అర్చకులు ముప్పాళ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. ఈ స్వామి వారి కల్యాణం తిలకించడానికి గ్రామంలోని ప్రజానీకం అందరూ కొండ పైకి వెళ్లి దేవస్థానంలో పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. అదేవిధంగా కొండ పైన దేవస్థానం ఆవరణలో పంచ ముఖ నిలువెత్తు ఆంజనేయస్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. మహిళలు ఈ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీస్సులను అందుకుంటారు. స్వామి వారి కల్యాణం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6 గంటలకు గ్రామంలో కల్యాణం జరుపుకున్న శ్రీలక్ష్మీ నర సింహస్వామి దంపతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో భక్తులు వెంటరాగా గరుడోత్సవం నిర్వహిస్తారు. కార్యక్రమానికి లో భక్తులు, గ్రామస్థులు విశేషంగా తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పావులూరు (ఇంకొల్లు), మే 21 : ఇంకొల్లు మండంలోని పావులూరు శ్రీ పొలిమేర వీరాంజనేయస్వామి తిరునాళ్ల మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసారు. అంకరార్పణ, అఖండ కలశ స్థాపన కార్యక్రమాలతో శ్రీహనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. వీరాంజనేయస్వామి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు తరలివెళ్లి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వచ్చే భక్తుల సౌకర్యార్థం పలు స్వచ్ఛంద సేవా సంస్థలు మజ్జిగ, తాగునీరు, అన్నదానం నిర్వహించారు. మంగళవారం ప్రారంభమైన తిరునాళ్ల బుధ, గురువారం జరుగుతుంది. చివరిరోజు గురువారం జరిగే తిరునాళ్లకు చుట్టుపక్కల మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై మల్లికార్జునరావు తెలిపారు.



దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

విత్తనాల షాప్‌లో సోదాలు

రెండు రకాల సీడ్స్ అమ్మకాల నిలిపివేత

ఇంకొల్లు, మే 21 : ఇంకొల్లులో శ్రీహనుమాన్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపులో విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయాధికారులు మంగళవారం సోదాలు చేశారు. రెండు కంపెలనీలకు చెందిన రెండు రకాల ఉత్పత్తులకు సో ర్స్ సర్టిఫికెట్ లేనందున దుకాణంలోని 28 కేజీల విత్తనాలు సుమారు రూ.3,36,388 విలువ కలిగిన వాటి అమ్మకాలను నిలిపివేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి కే రమణకుమార్ మాట్లాడుతూ ఎవరైనా అనుమతి లేకుండా, నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, వ్యవసాయాధికారి వేణుగోపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి రైతు విత్తనాలు కొనేటప్పుడు దుకాణదారుడు నుంచి కచ్చితంగా బిల్లు తీసుకోవాలని వేణుగోపాల్ సూచించారు.

ఎవరి వద్దా లంచాలు తీసుకోలేదు



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నకుమారి

మేదరమెట్ల, మే 21 : తాము ఎవరివద్దా లంచాలు తీసుకోలేదని, తమపై అనవసరంగా వివాదం చేస్తున్నారని, తప్పుడు కేసులు పెట్టడానికి ప్రయత్నించారని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. మంగళవారం కొరిశపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పనులు చేయకుండా ఏ ఒక్కరికీ బిల్లులు చెల్లించలేదని, తమపై అనవసరంగా నిందలు వేస్తున్నారన్నారు. ఇటువంటి విమర్శలు బాధిస్తాయన్నారు. కొంతమంది అధికారులు మండల అభివృద్ధిలో భాగం కాగా మరికొంత మంది వివాదం సృష్టిస్తున్నారన్నారు. కోరం లేకపోవడంతో మండల పరిషత్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. సమావేశానికి ఎం పీపీతో పాటు నలుగురు ఎంపీటీసీలు హాజరు కావడంతో సమావేశం వా యిదా వేశారు. వేసవిలో తాగునీటి సమస్యలు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, తొలకరిలో రైతులకు అందించాల్సిన పచ్చిరొట్ట వివరాలు కానీ సమావేశంలో చర్చించకపోవడంపై ప్రజాప్రతినిధుల తీరును మం డల ప్రజలు ఆక్షేపిస్తున్నారన్నారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యుడు తుళ్లూరి వెంకటరమణ, తహసీల్దార్ బి.సుశీల, ఎంపీడీవో సమతావాణి, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- ఒకే రోజు 10మందిని గాయపరిచన వైనం
- ప్రభుత్వాసుపత్రికి పరుగులు తీసిన క్షతగాత్రులు
- ఆందోళనలో ప్రజలు



కుక్క దాడిలో గాయపడి ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న వృద్ధురాలు



గాయపడిన బాలుడు

పర్చూరు, మే 21 : పిచ్చికుక్క దాడిలో 10 మంది తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం పర్చూరులో చోటుచేసుకుంది. ఒకే రోజు పదుల సంఖ్యలో పిచ్చికుక్క దాడిలో గాయపడడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడినవారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పరుగులు తీసారు. మూకుమ్మడిగా బాధితులు మూకుమ్మడిగా క్యూ కట్టి మరీ వైద్యం కోసం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు పోవడంతో వారుసైతం ఒకింత ఆందోళనకు గురయ్యారు. పర్చూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన మారినేని ఆదిలక్ష్మి పర్చూరు గుడికి వచ్చి తిరుగు ప్రయాణం చేస్తుంగా వెనుకుండి వచ్చిన పిచ్చి కుక్క ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలిని హుటాహుటిన పర్చూరు వైద్యశాలకు తరలించారు. వృద్ధురాలిని రక్షించే క్రమంలో అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తిని కూడా పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. అదేవిధంగా పర్చూరు ఇందిరాకాలనీలో ఆడుకుంటున్న ఇద్దరు బాలురుతోపాటు, సమీపంలో ఉన్న పశువులపై కూడా కుక్క దాడిచేసి గాయపడరినట్లు స్థానికులు చెప్తున్నారు.

పర్చూరులో పరిస్థితి దయనీయం

పర్చూరులో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వీధుల్లో ఎక్కడ చూసినా వందల సంఖ్యలో కుక్కలు కన్పిస్తుంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాత్రి సమయాల్లో వీధుల్లోకి రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఏది పిచ్చికుక్కో ఏది మంచి కుక్కో తెలియని స్థితిలో పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని శునకాల బారి నుంచి ప్రజలను రక్షించే విధంగా పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.